## క్లుప్తంగా

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈనెల 5న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. బీఆర్‌నగర్, వినాయక కాలనీ, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### రేపు అన్నమాచార్యుల జయంతి

హన్మకొండ కల్చరల్: వాగ్గేయకారుడు శ్రీమద్ తాళ్లపాక అన్నమాచార్యుల జయంతిని పురస్కరించుకుని శనివారం అన్నమయ్య సాహితీ కళా వికాస పరిషత్ ఆధ్వర్యంలో అన్నమాచార్యుల జయంతి, పరిషత్ వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నట్లు పరిషత్ వ్యవస్థాపకుడు సూత్రపు అభిషేక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హంటర్‌రోడ్డులోని గోల్డెన్ గార్డెన్స్‌లో ఈనెల 6న ఉదయం వేంకటేశ్వరస్వామి పూజ, అన్నమాచార్యుల పూజతో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

### పేదలకు నిత్యావసరాల పంపిణీ



ఖిలా వరంగల్: ఇటీవల కురిసిన భారీ వర్షానికి వరంగల్ 39వ డివిజన్ శాకరాశికుంట, మహారాజ కాలనీలు వరద ముంపునకు గురై పలు ఇళ్లల్లోకి వరదనీరు చేరి నిత్యావసర సరుకులు తడిసి ముద్దయ్యాయి. దాంతో సుమారు 25నిరుపేద కుటుంబాలు ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నాయి. ఈమేరకు వాక్ సమాఖ్య ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వన్నాల అరవింద్ ఆదేశాలతో బీజేపీ నేతలతో కలిసి డాక్టర్ వన్నాల వెంకటరమణ శాకరాశికుంటలో గురువారం పర్యటించారు. ప్రతీ కుటుంబానికి 25కిలోల బియ్యం, కిలో కందిపప్పు, నిత్యావసర సరుకులు అందజేశారు.

### పోలీసుల చేయూత



హసన్‌పర్తి: షార్ట్ సర్క్యూట్‌తో ఇళ్లు దగ్ధమై వీధిన పడిన మల్లారెడ్డిపల్లికి చెందిన బయ్య కుమారస్వామి కుటుంబానికి పోలీసులు చేయూతనందించారు. బాధిత కుటుంబానికి బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులను గురువారం అందించారు. కార్యక్రమంలో ఎస్సై విజయ్‌కుమార్, నాయకుడు కేతపాక భగత్, తదితరులు పాల్గొన్నారు.

### కేయూలో మహిళా జిమ్ సెంటర్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పద్మాక్షి మహిళా హాస్టల్‌లో విద్యార్థినుల కోసం జిమ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈమేరకు జిమ్ సెంటర్‌ను వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ గురువారం సందర్శించి పరిశీలించారు. ఈజిమ్‌లో 13రకాల వ్యాయామ పరికరాలను ఏర్పాటు చేస్తున్నారు. కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు, హాస్టళ్ల డైరెక్టర్ డాక్టర్ మంజుల, ప్రొఫెసర్ షమిత, డాక్టర్ సుచరితపాల్ పాల్గొన్నారు.

### భద్రత సూచనలు పాటించాలి

హసన్‌పర్తి: విద్యుత్ ప్రమాదాల నుంచి రక్షణకు ప్రజలు భద్రత సూచనలు పాటించాలని ఏడీఈ గంగారెడ్డి సూచించారు. విద్యుత్ భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని హసన్‌పర్తి మండల కేంద్రంలో వాల్‌పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ ఉన్నందున పలు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఈ మంగమ్మ, సబ్ ఇంజనీర్ శ్రీనివాస్, లైన్ ఇన్‌స్పెక్టర్ గోవర్ధన్, రౌతు రమేష్‌కుమార్, లైన్‌మెన్లు రాజేందర్, కుమారస్వామి, శ్రీనివాస్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

### మోషన్ ఐఐటీ, నీట్ ప్రారంభం



హన్మకొండ: హనుమకొండలోని రాజాజీనగర్‌లో ఏర్పాటు చేసిన రాజస్థాన్ కోటాకు చెందిన మోహన్ ఐఐటీ, నీట్ ఇన్‌స్టిట్యూట్ బ్రాంచ్‌ను మోషన్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ సీఈఓ నితిన్ విజయ్ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, ఎస్‌ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి, ఎన్ఐటీ రిజిస్ట్రార్ గోవర్ధన్ రావు, కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్, శివానీ విద్యాసంస్థల చైర్మన్ తాళ్లపల్లి స్వామిగౌడ్, ఆర్వీ విద్యాసంస్థల డైరెక్టర్లు రామ్మూర్తి, మల్లేశం, కార్పొరేటర్ చాడ స్వాతి, మోషన్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ హనుమకొండ బ్రాంచ్ చైర్మన్ వేణుగోపాల్ గౌడ్, బ్రాంచ్ మేనేజర్ గణేష్ గౌడ్ పాల్గొన్నారు.

# పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

హన్మకొండ అర్బన్: హనుమకొండ జిల్లాలో అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, నష్టపోయిన రైతులకు ప్రతి ఎకరాకు రూ.20 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు కాంగ్రెస్ నాయకులతో కలిసి కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సీజన్‌లో ఇప్పటికే రెండు సార్లు అకాల వర్షాలతో పలు పంటలు దెబ్బతిన్నాయని వివరించారు. ఆరుకాలం శ్రమించి పండించిన పంట నేలపాలు కావడం రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేల చొప్పున పరిహారం ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్.. ఇంతవరకు రైతులకు అందించలేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్‌రావు, పరకాల, వర్ధన్నపేట నియోజకవర్గ కోఆర్డినేటర్లు ఇనగాల వెంకట్రాంరెడ్డి, నమిండ్ల శ్రీనివాస్, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, పోతుల శ్రీమాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కూచన రవళి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ, జిల్లా ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ పెరుమాండ్ల రామకృష్ణ, నాయకులు కూర వెంకట్, గుంటి స్వప్న, రవీందర్, ఉపేందర్, అంకుష్, లలిత, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

**సీపీఐ ఆధ్వర్యంలో..**

మడికొండ: అకాల వర్షంతో నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి డిమాండ్ చేశారు. మడికొండ, కుమ్మరిగూడెం గ్రామాల్లోని పంట పొలాలను నాయకులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను కలిసి వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భిక్షపతి మాట్లాడుతూ ప్రభుత్వం జిల్లాకు ఒక నోడల్ అధికారిని నియమించి పంట నష్టంపై సమగ్ర సర్వే చేయాలని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, కాజీపేట మండల కార్యదర్శి మునిగాల భిక్షపతి, జిల్లా సమితి సభ్యులు మాలోతు శంకర్ తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

## ప్రారంభానికి సిద్ధం



ప్రాక్టీసింగ్ స్కూల్ ఆవరణలోని సైన్స్ పార్కు



కిట్స్ కళాశాలలో ఇన్నోవేషన్ సెంటర్



ఎస్సీ, ఎస్టీ సెల్



మోడల్ వైకుంఠధామం

వరంగల్ నగర పర్యటనకు మంత్రి కేటీఆర్ శుక్రవారం రానున్నారు. ఈమేరకు ఆయన హనుమకొండ లష్కర్ బజార్‌లోని సైన్స్ పార్కు, భీమారం కిట్స్ కళాశాలలోని ఇన్నోవేషన్ సెంటర్, హంటర్‌రోడ్డు సైన్స్ రీజినల్ సెంటర్‌లోని ఎస్సీ, ఎస్టీ సెల్, హనుమకొండ వాజ్‌పేయినగర్‌లోని మోడల్ వైకుంఠధామాన్ని ప్రారంభించనున్నారు. అలాగే మరికొన్ని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

# సమస్యలపై మంత్రి కేటీఆర్ స్పందించాలి

విద్యారణ్యపురి: విద్యారంగ సమస్యలపై మంత్రి కేటీఆర్ స్పందించాలని, లేకుంటే వరంగల్‌లో కేటీఆర్ పర్యటనను అడ్డుకుంటామని ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ హెచ్చరించారు. కాకతీయ యూనివర్సిటీలో పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేయూ బీఎస్ఎఫ్ ఇన్‌చార్జ్ మనోహర్, యూత్ కాంగ్రెస్ ప్రతినిధి రాకేష్ కృష్ణన్, బీసీ విద్యార్థి సంఘం నేత కొంరాజ్, బాధ్యులు ప్రశాంత్, సూర్య, సాయికిరణ్, వెంకటేష్, సాల్మన్, సురేష్ పాల్గొన్నారు.

**అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి**

హన్మకొండ: వరంగల్ మహానగరంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ డిమాండ్ చేశారు. అత్త సొమ్ము.. అల్లుడు దానం చేశారన్న చందంగా కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించడానికి మంత్రి కేటీఆర్ రావడం సిగ్గుచేటని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

**ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలి**

వరంగల్ మహానగర పర్యటనకు వస్తున్న మంత్రి కేటీఆర్ నగరాభివృద్ధిపై తాను వేసిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. హనుమకొండలో పలు ప్రశ్నలతో కూడిన బహిరంగ లేఖను రాకేష్‌రెడ్డి గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

మామునూరు: రైతుల సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయమని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని మండల పీఏసీఎస్ వైస్ చైర్మన్ సోల్తీ భూమాత, కార్పొరేటర్ గద్దె బాబు సూచించారు. బొల్లికుంట గ్రామంలో వినాయక రైతు సొసైటీ ఆధ్వర్యంలో నోడల్ ఆఫీసర్ నాగ నారాయణ, వ్యవసాయాధికారి విజ్ఞాన్, ఏఎంసీ డైరెక్టర్ తుమ్మ రవీందర్‌రెడ్డితో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈఓ సత్యప్రకాశ్, ప్రసాద్, దామోదర్, బాబురావు, స్వర్ణలత పాల్గొన్నారు.

## గుడిసెవాసులందరికీ పట్టాలివ్వాలి

హన్మకొండ అర్బన్: ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని తలదాచుకుంటున్న అర్హులైన పేదలకు జీఓ నంబర్ 58, 59 ప్రకారం వ్యక్తిగత పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం హనుమకొండ జిల్లా కమిటీ కన్వీనర్ బొట్ల చక్రపాణి డిమాండ్ చేశారు. ఈమేరకు జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణికి గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమకొండలోని పలు ప్రాంతాల్లో గత 15 ఏళ్లుగా ఇళ్లులేని నిరుపేదలు ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకొని నివాసముంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎం.చుక్కయ్య, టి.ఉప్పలయ్య, వాంకుడోతు వీరన్న, గుమ్మడి రాజుల రాములు, మంద సంపత్, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

# మార్కెట్‌లో మక్కల కొనుగోలు కేంద్రం

వరంగల్: ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీవత్స కోట గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మార్క్‌ఫెడ్ ద్వారా ఖిలా వరంగల్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దిడ్డి భాగ్యలక్ష్మి, డీఎంఓ పి.ప్రసాదరావు, ఉన్నత శ్రేణి కార్యదర్శి బీవీ.రాహుల్, పీఏసీఎస్ సీఈఓ కుమారస్వామి, డీసీఓ సంజీవరెడ్డి, గ్రేడ్ –2 కార్యదర్శులు టి.చందర్‌రావు, బియాబానీ, ఏఎస్ఓలు, పర్యవేక్షకులు, రైతులు, వ్యాపారస్తులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీవత్స

## గులాబీ జెండాలను తొలగించండి

వరంగల్ అర్బన్: నగరంలో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా, ఆత్మీయ సమ్మేళనం పేరిట పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేసిన గులాబీ జెండాలను తొలగించాలని బీజేపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు బల్దియా ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ అనిసుర్ రషీద్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు.

## కాంట్రాక్ట్ ప్రొఫెసర్లను క్రమబద్ధీకరించాలి





ధర్నా చేస్తున్న అసోసియేషన్ బాధ్యులు

కేయూ క్యాంపస్: యూనివర్సిటీల్లోని కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని కుక్టా జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు క్యాంపస్‌లోని మొదటి గేట్‌నుంచి పరిపాలన భవనం వరకు గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్, డిగ్రీ లెక్చరర్ల మాదిరిగానే తమను కూడా రెగ్యులరైజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ చిర్ర రాజు, బి.సతీష్, వెంకటగోపినాథ్, ఫిరోజ్‌పాషా, నాగేశ్వర్‌రావు, రాజేష్, సత్య, కనకయ్య, శంకరయ్య, సూర్యనారాయణ, సూర్యం, రమాదేవి, రంజిత్, రాజేశ్వరి, సాంబశివరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, తెలంగాణ యూనివర్సిటీల్లోని కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని కాంట్రాక్ట్ లెక్చరర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం పరిపాలన భవనం వద్ద ధర్నా నిర్వహించారు.

# చందర్‌రావు సేవలు ప్రశంసనీయం



సన్మానిస్తున్న వ్యాపారులు, ఉద్యోగులు

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో గ్రేడ్ –2 కార్యదర్శిగా తోట చందర్‌రావు అందించిన సేవలు ప్రశంసనీయమని వరంగల్ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు ఇన్నారపు మల్లేషం కొనియాడారు. పదోన్నతిపై నల్లగొండ జిల్లా నిడమనూరు వ్యవసాయ మార్కెట్ గ్రేడ్ –1 కార్యదర్శిగా చందర్‌రావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం రాత్రి మార్కెట్ ఉద్యోగులు, వ్యాపారులు ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. జేడీఎం మల్లేషం, డీఎంఓ ప్రసాదరావు, ఉన్నత శ్రేణి కార్యదర్శి రాహుల్ మాట్లాడారు. అనంతరం ఆయనను గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో వరంగల్ ఛాంబర్ ప్రధాన కార్యదర్శి వేద ప్రకాశ్, కాటన్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతలపల్లి వీరారావు, కూరగాయల వర్తకం సంఘం అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

# విలీన గ్రామాల్లో గొర్రెల పంపిణీకి గ్రీన్ సిగ్నల్

హసన్‌పర్తి: విలీన గ్రామాల్లో గొర్రెల పంపిణీకి ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చినట్లు పశువైద్యాధికారి డాక్టర్ క్రాంతికుమార్ వెల్లడించారు. హసన్‌పర్తి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కేతపాక సునీత అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా పశు సంవర్ధకశాఖపై జరిగిన చర్చ సందర్భంగా డాక్టర్ క్రాంతి కుమార్ మాట్లాడారు. జూన్ నెల నుంచి విలీన గ్రామాల్లో కూడా గొర్రెలు పంపిణీ చేస్తామని ప్రకటించారు. అకాల వర్షాల కారణంగా గ్రామాల్లో పంట నష్టం జరిగిందని, ఇప్పటి వరకు కొన్ని గ్రామాల్లో అసలు సర్వే నిర్వహించలేదని సూదన్‌పల్లి సర్పంచ్ ప్రశ్నలేవనెత్తారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. హసన్‌పర్తి మండలంలో ఎనిమిది మంది ఎంపీటీసీలు, 15 మంది సర్పంచ్‌లు ఉన్నారు. అయితే సమావేశానికి ఎంపీపీ, వైస్ ఎంపీపీతో పాటు మరో ఇద్దరు ఎంపీటీసీలు, ముగ్గురు సర్పంచ్‌లు మాత్రమే హాజరయ్యారు.



మాట్లాడుతున్న ఎంపీపీ కేతపాక సునీత

## సంక్షిప్తంగా

### కేజీబీవీల టీచర్ల షిఫ్టింగ్ దరఖాస్తులు

విద్యారణ్యపురి / కాశీబుగ్గ సెంటర్: కస్తూరిబాగాంధీ బాలికల (కేజీబీవీ) విద్యాలయాల్లో పనిచేస్తున్న స్పెషల్ ఆఫీసర్లు, పీజీసీఆర్‌టీలు, సీఆర్‌టీలు, పీఈటీలు, ఏఎన్ఎంలు, అకౌంటెంట్లు షిఫ్టింగ్‌లకు (మార్పు) అవకాశం ఉందని హనుమకొండ, వరంగల్ డీఈఓలు ఎండీ.అబ్దుల్‌హై, వాసంతి కోరారు. ఈనెల 6నుంచి 9వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని వారు సూచించారు.

### రేపు ఆహార శుద్ధి యంత్ర పరికరాల ప్రదర్శన

కరీమాబాద్: హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో శనివారం ఆహార శుద్ధి యంత్ర పరికరాల ప్రదర్శన నిర్వహించనున్నట్లు వరంగల్ జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారి నరసింహస్వామి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### కేటీఆర్ సభను విజయవంతం చేయండి

నయీంనగర్: నగరంలో శుక్రవారం జరగనున్న మంత్రి కేటీఆర్ బహిరంగ సభకు కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని తెలంగాణ భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం అధ్యక్షుడు ఇమ్మడి బాబు పిలుపునిచ్చారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మిక భవన్‌కు మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు.

### మంత్రిని ఘనంగా స్వాగతిద్దాం

ఖిలా వరంగల్: వరంగల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ శంకుస్థాపనకు విచ్చేయనున్న మంత్రి కేటీఆర్‌ను నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతించాలని ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పిలుపునిచ్చారు. ఈమేరకు వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని ఏఎస్ఎం కళాశాల సమీపంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

### కాలనీ అభివృద్ధికి కృషి చేస్తా..

కరీమాబాద్: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 40వ డివిజన్ డీకేనగర్ కాలనీని అభివృద్ధి చేస్తానని తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. కాలనీలో గురువారం పర్యటించి పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో మరుపల్ల రవి, బైరబోయిన దామోదర్‌యాదవ్, సిద్ధం రాజు, ముష్కమల్ల అరుణ, సుధాకర్, బోగి సువర్ణ, సురేష్, పూజారి విజయ్, కుండె రాజు పాల్గొన్నారు.

### 6వ డివిజన్‌లో బీజేపీ కార్యాలయం ప్రారంభం

నయీంనగర్: ప్రజలకు సహకార కేంద్రాలుగా బీజేపీ కార్యాలయాలు ఉంటాయని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం 6వ డివిజన్ అధ్యక్షుడు చింత రఘుపతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీజేపీ కార్యాలయాలన్ని రావుపద్మ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ఏనుగుల రాకేష్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దేశిని సదానందం గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు పాశికంటి రాజేంద్రప్రసాద్, నియోజకవర్గ కన్వీనర్ కందగట్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

### నియామకం

హన్మకొండ: లంబాడీ హక్కుల పోరాట సమితి అనుబంధ విద్యార్థి సంఘం లంబాడీ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎల్ఎస్ఎఫ్) ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా నెక్కొండ మండలం అజ్మీర తండాకు చెందిన మాలోతు వెంకన్న నాయక్‌ను నియమించినట్లు లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ నాయక్ తెలిపారు.

### పలువురు నాయకుల ముందస్తు అరెస్ట్

మడికొండ: శుక్రవారం హనుమకొండ జిల్లాలో మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులను గురువారం రాత్రి ముందస్తుగా మడికొండ పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, వస్కుల శంకర్, బైరి లింగమూర్తి, నీలం వేణుయాదవ్, వస్కుల నాగరాజు, జిట్ట చంటి ఉన్నారు.

ఖిలా వరంగల్: మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో గురువారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ రేణుకుంట్ల శివకుమార్‌తో పాటు పలువురు నాయకులకు మిల్స్‌కాలనీ పోలీసులు ముందుస్తుగా అరెస్ట్ చేశారు.

కేయూ క్యాంపస్: మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో గురువారం రాత్రి కాకతీయ యూనివర్సిటీ బీసీ విద్యార్థి సంఘం ఇన్‌చార్జ్ నాగరాజును పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

### ఆమెతో పాటు ఆయన కూడా హాజరు

హసన్‌పర్తి: గురువారం జరిగిన హసన్‌పర్తి మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి బైరాన్‌పల్లి ఎంపీటీసీ జట్టి మంజులతో పాటు ఆమె భర్త జట్టి కుమారస్వామి కూడా హాజరయ్యారు. ఈక్రమంలో జర్నలిస్టులు వారి ఫొటోలు తీస్తుండగా కుమారస్వామి అక్కడి నుంచి జారుకున్నారు.

### పంచముఖ హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన

కరీమాబాద్: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 44వ డివిజన్ తిమ్మాపూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పంచముఖ హనుమాన్ విగ్రహాన్ని గురువారం వైభవంగా ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజకు హాజరైన వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. పూజా కార్యక్రమంలో ఆలయ స్థల దాతలు పోశాల కుమారస్వామి, మాజీ సర్పంచ్ సదానందం, భిక్షపతి, ప్రభాకర్, సుధాకర్, రోడ్డుకు స్థలం ఇచ్చిన దాతలు వల్లాల రాము, వల్లాల నర్సయ్య, రవి, విగ్రహదాతలు బాలయ్య, గురుస్వామి, ఇనుగాల జోగిరెడ్డి, కార్పొరేటర్లు అరుణ, అనిత పాల్గొన్నారు.

### దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన

మడికొండ: వరంగల్ పరిధిలోని 46వ డివిజన్ రాంపూర్‌లో గురువారం రేణుకఎల్లమ్మ, మహంకాళి, బీరప్ప దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం రెండవ రోజు గురువారం కొనసాగింది. ఈమేరకు అర్చకుడు సంతోష్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య ఉదయం సామూహిక హోమాలు, సాయంత్రం ధాన్యదివాసం, శయ్యాదివాసం, పుష్పాదివాసం, ఫలదివాసం, మహాహారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు.

### వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం

హన్మకొండ అర్బన్: నగరంలోని హనుమద్గిరి హనుమకొండ పద్మాక్షి దేవాలయం గుట్టపై నెలకొన్న లక్ష్మీనరసింహ స్వామి కల్యాణాన్ని వేద పండితులు షణ్ముఖ పద్మనాభ అవధాని, నాగిళ్ల శంకర్ శర్మ, ఆలయ పూజారి నాగరాజు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కల్యాణ మహోత్సవానికి పుస్తెమట్టెలు బహూకరించిన దాత సుంకరి నరేందర్ (సాయి జ్యువెలర్స్)ను సన్మానించారు.

### నృసింహస్వామి జయంతి

రామన్నపేట: వరంగల్ భద్రకాళి రోడ్డులోని నృసింహస్వామి ఆలయంలో గురువారం జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామివారికి కలశస్థాపన, పంచామృతాభిషేకం, 11రకాల పండ్లతో అభిషేకం నిర్వహించారు. సాయంత్రం పూజలు నిర్వహించారు. రాము, ప్రవీణ్, రంగనాథ్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

### హనుమాన్ మాలధారులకు అన్నదానం

హన్మకొండ చౌరస్తా: హనుమాన్ మాలధారులకు మాజీ డిప్యూటీ మేయర్ కాజాసిరాజుద్దీన్ గురువారం అన్నదానం చేశారు. హనుమకొండ గుడిబండల్‌లోని భక్తాంజనేయస్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారి కిరణ్‌శర్మ, దేవులపల్లి ప్రదీప్, హనుమాన్ మాలధారులు పాల్గొన్నారు.

### అసత్య ఆరోపణలు సరికాదు

కాశిబుగ్గ / ఖిలా వరంగల్ : భూకబ్జాలు చేస్తున్నానని తనపై సామాజిక మాధ్యమాల్లో అసత్య ఆరోపణలు చేస్తున్న అడప శ్రీకాంత్, ఆయన తల్లి కనకలక్ష్మిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని 18వ డివిజన్ కార్పొరేటర్ వస్కుల బాబు కోరారు. ఈమేరకు మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

# భరోసా సభను విజయవంతం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

హన్మకొండ: హైదరాబాద్‌లో ఈనెల 7న జరగనున్న తెలంగాణ భరోసా సభను విజయవంతం చేయాలని బహుజన సమాజ్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు శనిగరపు రాజు పిలుపునిచ్చారు. తెలంగాణ భరోసా బహిరంగ సభ కరపత్రాలను హనుమకొండ వడ్డేపల్లిలోని జైభీమ్ యూత్ కార్యాలయంలో రాజు, జైభీమ్ యూత్ సభ్యులు గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీళ్లు, నియామకాలు, నిధుల నినాదంతో కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ దొరల పాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. దగాపడిన తెలంగాణను కాపాడేందుకు, తెలంగాణ ప్రజలకు భరోసా కల్పించేందుకు ఈ సభను నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జైభీమ్ యూత్ నాయకులు తాళ్లపల్లి విజయ్, తాళ్లపల్లి ప్రవీణ్, యోబు, టి.టోని, ప్రదీప్, టి.సుధీర్, మధు, పవన్, వీరస్వామి, ప్రత్యూష, రాసమల్ల రూపస్ పాల్గొన్నారు.

# జిజ్ఞాస ప్రదర్శనలో డిగ్రీ విద్యార్థుల ప్రతిభ

ఖిలా వరంగల్: ఇటీవల హైదరాబాద్‌లోని నాంపెల్లిలో కళాశాల విద్యాశాఖ నిర్వహించిన రాష్ట్రస్థాయి (స్టూడెంట్ స్టడీ ప్రాజెక్ట్) జిజ్ఞాస ప్రదర్శనలో రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వాణిజ్య శాస్త్ర సహాయ ఆచార్యులు డాక్టర్ ఎం.సోమయ్య పర్యవేక్షణలో ఏ స్టడీ ఆన్ సేవింగ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ అప్రోచ్ ఆఫ్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ ఫ్యాకల్టీ ఆఫ్ ఈస్ట్‌వైల్ వరంగల్ డిస్ట్రిక్ అనే అంశంపై విద్యార్థులు చైతన్య ప్రియ ఆర్షియా, మహీన్ సుల్తానా, హస్మిత, రిషిత తయారు చేసిన ప్రాజెక్ట్.. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఈమేరకు విద్యార్థులను కళాశాలలో గురువారం అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

## సైబర్ నేరాలపై అవగాహన

మడికొండ: సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై మడికొండ ఎస్సై దివ్య అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. అపరిచితుల కాల్స్, మెసేజ్‌లు, లింక్‌లకు స్పందించవద్దని అన్నారు. బ్యాంక్ ఖాతాలు, ఓటీపీలు, వ్యక్తిగత వివరాలను ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు. సైబర్ మోసానికి గురైనట్లు గ్రహిస్తే వెంటనే పోలీసులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ జయ్‌రాజ్, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న పోలీసులు